రాంబాబు గెల్చాడు

ఉత్తంనేని రాధాకృష్ణమూర్తి

రాంబాబు పూజలూ పునస్కారాలూ చేస్తున్నాడని విన్నప్పుడు చిరంజీవి చాలా ఆశ్చర్యపడ్డాడు. వింతల్లోకెల్లా వింతయిన విషయంగా కనిపించిందతనికది. అంతేకాదు అసలతనికి నమ్మబుద్ధి కాలేదు కూడా. కాని నమ్మక తప్పలేదు.

"కూర్చోండి, లోపల అయ్యగారు పూజచేసుకుంటున్నారు," అని పనిపిల్ల చెప్పింది విన్నాక.

ఆరేళ్ళక్రితం నాగార్జునసాగర్‌లో వాళ్ళిద్దరూ కొలీగ్స్‌గా పనిచేసారు. అప్పట్లో ఇద్దరూ చాలా స్నేహంగా ఉండేవాళ్ళు, బ్రహ్మచారులు కావటంతో ఒకే క్వార్టరులో ఉంటూ, ఒకే మెస్‌ని మెయిన్‌టెయిన్ చేసుకుంటూ, పరస్పరాభిప్రాయాల్ని ఎక్ఛేంజి చేసుకుంటూ చాలా ఆత్మీయంగానూ, అన్యోన్యంగానూ. అట్లాంటిది ట్రాన్స్ఫర్ల కారణంగా

విడిపోయారు. మళ్ళీ ఇన్నాళ్ళకు కలుసుకుంటున్నారు. రెండేళ్ళ క్రితం నుంచీ రాంబాబు ఈ ప్రాజెక్టులో ఉంటున్నాడు. చిరంజీవే కొత్తగా ట్రాన్స్ఫరై వచ్చాడు.

లోపలిగదిలోంచి గంట మ్రోగిస్తున్న చప్పుడు వినిపించటంతో పూజ పూర్తి కావచ్చింది గావును అనుకున్నాడు చిరంజీవి. కొద్ది క్షణాల తర్వాత చేతిలో కొబ్బరిముక్కల పళ్లెంతో రాంబాబు ముందుగదిలోకి వచ్చాడు. చేతిలో పళ్ళాన్ని చిరంజీవి ముందుకు చాపుతూ అన్నాడతను.

"తీసుకో!"

ధోవతీ, భుజంచుట్టూ ఉత్తరీయంతో, నుదుట స్పష్టాస్పష్టంగా కనిపిస్తున్న విభూదిరేఖలతో–రాంబాబు–విచిత్రంగా కనిపించాడు చిరంజీవికి.

"ఏమిటలా చూస్తున్నావు?" అన్నాడు రాంబాబు.

"నీ అవతారానికి! నాకు నవ్వొంటే నవ్వొస్తుంది నిన్ను చూస్తుంటే," అన్నాడు చిరంజీవి నవ్వబోతూ.

"సర్లే, ముందు ప్రసాదం పుచ్చుకో," అన్నాడు రాంబాబు నిర్వికారంగా.

చిరంజీవి ఒక కొబ్బరిముక్కను తీసుకుని నోట్లో వేసుకున్నాడు.

"చాలా తప్పది, ప్రసాదాన్ని ఎప్పుడూ కళ్ళకద్దుకుని తినాలి!"

రాంబాబు మాటలకు చిరంజీవి అయోమయంగా చూసాడు. అసలు తన ఎదురుగా వుంది తన మిత్రుడు రాంబాబేనా అని కూడా కొద్దిక్షణాలపాటు ఆశ్చర్యం కలిగిందతనికి. పూర్వం సాగర్‌లో పని చేస్తున్న రోజుల్లో రాంబాబు పరమ నాస్తికుడుగా ఉండేవాడు. అతను ఫిలాసఫీ పుస్తకాలే కాక సైన్సుకు సంబంధించినవి కూడా బాగా చదివిఉండటంవల్ల దేవుడు లేడనే తన వాదాన్ని చాలా సహేతుకంగా వినిపించి వొప్పించేవాడు ఇవతలివాళ్ళను. అంతేకాదు, దేవుణ్ణి నమ్ముతున్నామనే వాళ్ళంతా పరమమూర్ఖులైనా అయి ఉండాలి. లేక దొంగముండాకొడుకులైనా అయిఉండాలంటూ చాలా అనాగరికమైన భాషలో ఉద్రేకంతో మాట్లాడేవాడు. అట్లాంటి మనిషి ఇవాళ పూజలు చేస్తుండటమే కాక ప్రసాదాన్ని కళ్ళకద్దుకుని తినమంటున్నాడంటే చిరంజీవికి ఎంతో విచిత్ర మనిపించింది. అతనేదో అడుగుదా మనుకుంటుండగా రాంబాబు లోపలికి వెళ్ళిపోయాడు. తర్వాత అతను డ్రెసప్ అయి తిరిగివచ్చేసరికి అతని వెనక మరో స్త్రీ ఉంది కాఫీ ట్రేతో.

"అనూరాధ–నా మిసెస్. చిరంజీవి–ఇంతకుముందే చెప్పాను కదా నీకు!"

"నమస్కారమండీ!" అందామె ట్రేని టీపాయ్‌మీద పెడుతూ.

"నమస్కారం!"

అన్నాడే కాని ఆమెను చూసాక చిరంజీవికి ఆపైన నోట మాట రాలేదు. ఆమె చాలా పొడుగ్గా ఉంది. అందుకుతగ్గ

లావున్నా సన్నమనిపించేట్లుగా ఉంది. ఆమె కళ్ళు తేనెరంగులో ఉండి అదో వింత ఆకర్షణను సంతరించుకున్నాయి. వంకలులేని ఆమె పొడుగాటి ముక్కు చివర సన్నటి కాడ రింగులా చుట్టబడి ఉండి ఏదో కొంటెదనాన్ని కనబరుస్తోంది. ఆమె నోరు ముద్దుముద్దుగా ఉంది, పెదిమల చివర్లు బాణపు కొనల్లా బుగ్గల్లోకి మొనదేలి ఉంది. మొత్తంమీద ఆమెదొక అపూర్వమయిన అందం పూర్వం రాజ్యాలేలిన మహారాజుల్లోనే కనిపిస్తుందేమో అట్లాంటి సౌందర్య దర్పమూ, వైభవమూ.

మూడేళ్ళక్రితం వాళ్ళ వివాహపు ఆహ్వానం అందినా కూడా చిరంజీవి ఆ పెళ్ళికి వెళ్ళలేదు, పనుల వత్తిడి కారణంగా. ఆ తర్వాత కూడా మిత్రులిద్దరూ మరీ దూరదూరాల్లో ఉండటంతో ఇంతవరకూ మళ్ళీ కలుసుకోవటం పడలేదు. అట్లాంటిది ఇన్నేళ్ళ తర్వాత కలుసుకోవటం మిత్రులిద్దరికీ ఎంతో ఆనందాన్ని కలిగించింది. ఆబగా ఇద్దరూ ఏవేవో కబుర్లు చెప్పుకున్నారు. ఆ తర్వాత చిరంజీవి రోజూ ఏదో ఓ ఖాళీసమయం చూసుకుని రాంబాబువద్దకు వచ్చేవాడు. మిత్రులిద్దరూ ఏవేవో మాట్లాడుకుంటుంటే ఎదురుగా కూర్చుని అనూరాధ కుతూహలంగా వింటుండేది ఒకో సమయాన తనూ జోక్యంకల్పించుకుని సంభాషణల్లో పాలు పంచుకునేది. అంతకంటే మధురమైన జీవితాలు ఏముంటాయి కనక ! ఇట్లాంటి సమయాల్లోనే ఒకసారి చిరంజీవి తాను అడగాలనుకుంటున్న ప్రశ్న అడిగాడు రాంబాబును

"అవునూ నువ్వింత హఠాత్తుగా నాస్తికత్వాన్ని వదలి భక్తిమార్గంలోకి ఎలా వచ్చావ్ ?"

"హఠాత్తుగా ఏమీకాదు. సహజంగానే - కాలక్రమాన "

"అదే. ఏ కారణాలవల్ల ?"

"రెండేళ్ళక్రితం ఒకరాత్రి 'పరమాత్మ' స్వరూపాన్ని దర్శించాను. అప్పటినించీ !" అన్నాడు రాంబాబు.

"టార్, నేను నమ్మను," కోపంగా కుర్చీని వెనక్కి జరుపుతూ అన్నాడు చిరంజీవి

"ఎందుకని నమ్మరు.?" సీరియస్‌గా అడిగింది అనూరాధ.

"ఎందుకని ఏమిటండీ," చిరంజీవి అన్నాడు "ఒకప్పుడు ఈ మహానుభావుడి వాదనలవల్లే ఆస్తికుడిగా ఉండే నేను కాస్తా నాస్తికుడినయాను. అట్లాంటిది ఇవాళ మళ్ళీ ప్లేటు ఫిరాయిస్తున్నాడంటే ఏమనాలి ? ! మనిషికి వాదనాపటిమ ఉన్నంతమాత్రాన ఎట్లాపడితే అట్లా మాట్లాడకూడదు. అప్పట్లో ఏమనేవాడో తెలుసా, దేవుడు, దయ్యము, మంత్రాలు, మాయలు ఇట్లాంటివేమీ ప్రపంచంలో లేవనీ, వింతగా చెప్పుకోబడే ప్రతీది



ప్రకృతి స్వభావరీత్యానే జరుగుతోందనీ, ఈ లోకంలో జరుగుతున్నాయని చెప్ప బడుతూ దేవునికి ఆపాదించబడుతున్న ప్రతి వింతకూ సైన్సు సమాధానాన్ని చెప్పగలదనీ, అట్లా ఏ ఒక్క వింత నయినాగాని సైన్సు విశ్లేషించి చెప్ప లేకపోతోందంటే అందుకు కారణం కేవలం సైన్సు ఇంకా అందాకా అభివృద్ధి చెందకపోవటమేననీ, ఇవాళ కాకపోతే రేపైనా సైన్సు ప్రతి వింతకూ సమాధానం చెప్పగలదనీ అనేవాడు. అట్లాంటి పెద్ద మనిషి ఇవాళ తను 'పరమాత్మ' స్వరూపాన్ని సందర్శించానని అంటే ఎలా నమ్మమంటారు ?"

"లేదండీ, ఈయనకు కొన్ని అసాధారణ శక్తులుకూడా అలవడ్డాయి." అనూరాధ అన్నది. "ఉదాహరణకు ఒకోరోజు ఉదయం పూజచేస్తున్నప్పుడు ఈయన పీటమీద కూర్చున్నవారల్లా భూమికిపైన అరడుగు ఎత్తున గాల్లో తేల్తుంటారు ఏ ఆధారమూ లేకుండా. దీనికేమంటారు మీరు ?"

అంతలో రాంబాబు కల్పించుకున్నాడు.

"పోనీలే మిత్రమా ఎవరి నమ్మకాలు వారివి. బహుశా ఒకప్పుడు నిన్ను నేనే చెడగొట్టి ఉండవచ్చు. ఆ ఉడుకురక్తపు అవివేకోద్రేకంలో. కాని ఒకటి చెప్ప దల్చుకున్నాను. కొన్ని పవిత్రమైన అనుభూతులు అందరికీ అందుబాటులోకి రావు. దానికెంతో సాధన ఉండాలి.... ఎవరో ఎక్కడో ఏమో చూసామనీ, చేసామనీ, రుజువుపర్చామనీ చెబుతుంటే ప్రత్యక్షంగా చూడకుండానే వాటిని అథారిటీగా తీసుకుని మనం గుడ్డిగా నమ్ముతున్నాం. అదే సైన్సు ! మరి అట్లాగే కొంతమంది యోగులూ,

ఋషులూ పరమహంసగానీ, అరవిందుడు గానీ తామేదో దర్శించామని చెబుతున్నప్పుడు మనమెందుకని విశ్వసించలేక పోతున్నాం?? అక్కడే ఉంది మన అజ్ఞానమూ, మూర్ఖత్వమూనూ. మనమూ ఏకాగ్రతనూ, సాధననూ అలవర్చుకోలేము కాబట్టి — మనకా ఆనందపు టంచులు ఎటూ అందవు కాబట్టి— అవునా? కాబట్టి ఇప్పటికా ప్రస్తావనను వదలివేద్దాము ఎందుకైనా మంచిది...."

వాదనలో రాంబాబుతో తానెటూ గెలవలేదని చిరంజీవికి మొదటినుండీ తెలుసు.

"అయితే నీవు దేవుడున్నాడంటావు?" అన్నాడు ఉక్రోషంగా.

"అహ!"

"ఏ రూపంలో... "

"నిరాకారంగా. అయితే మనకోసం- ఐ మీన్ ఏకాగ్రత కోసం - ఏ రూపంలో నైనా అరాధించుకోవచ్చు. రాముడు, కృష్ణుడు, శివుడు, అల్లా, జీసస్.... ఎట్లాగైనా సరే "

"మరి పాపపుణ్యాలు?"

"అవీ వున్నాయి. ఎవరి పాప పుణ్యాలకు వాళ్ళే కర్తలు. ఈ లోకంలో కాకపోయినా పై లోకంలో నయినా ఎవరికి తగ్గ ప్రాయశ్చిత్తాలూ రివార్డులూ వాళ్ళకు తప్పవు"

"నువ్వింత మాడ్ ఫెలో వవుతావని నేను కలలో కూడా అనుకోలేదు," అంటూ లేచిపోయాడు చిరంజీవి.

"నీ ఖర్మ-" చిన్నగా గొణిగాడు రాంబాబు.

భర్తవేపు మెచ్చుకోలుగా చూసింది అనూరాధ.....

* * *

పై సంఘటన తర్వాత అయిదేళ్ళు ముందుకు జరిగాయి. అయిదేళ్ళ కాలమనేది కొందరి జీవితాలకు సుదీర్ఘమైన రేఖ అయితే మరికొందరికి అది చాలా హ్రస్వరేఖ. మనుషుల వ్యక్తిగత పరిస్థితులు కిందుమీదూ కావటానికి ఆమాత్రం కాలం చాలు.

ఉన్న తండ్రి కాస్తా కాలంచేయటంతో ఆస్తిపరుడు కావటంవల్ల చిరంజీవి ఉద్యోగానికి రిజైన్‌చేసి స్వంత ఊళ్ళో వ్యవసాయం చేసుకోనారంభించాడు.

రాంబాబు మూడేళ్ళ క్రితం పెద్ద జబ్బుచేసి చనిపోయాడు. అనూరాధకు నా అనేవాళ్ళెవరూ లేకపోవడంతో చిరంజీవి కోరటం మూలంగానూ తనకు గత్యంతరంలేని పరిస్థితుల్లోనూ ఆమె వచ్చి చిరంజీవి నీడలో కాలం వెళ్ళబుచ్చుతోంది. కాలక్రమేణా ఆమె భర్తపోయిన శోకాన్నుంచి దూరమయినా కొన్ని కార్యక్రమాల్ని మట్టుకు విఘ్నం కలగకుండా యాంత్రికంగా చేసుకుపోతోంది. వాటిల్లో రాంబాబు ఫోటోకి రోజూ ఉదయాన పూజలు చేయటం ఒకటి. శనివారంనాడు ఆ తతంగం మరీ ఎక్కువగా ఉంటుంది.

అనూరాధ తనమీద ఆధారపడి బ్రతుకుతుండటం చిరంజీవికి ఏమీ భార మనిపించటంలేదు. సరికదా అతను గర్వాన్ని ఫీలవుతున్నాడు, అంత దివ్య సౌందర్యం తన ఇంట్లో అటూ ఇటూ కదుల్తోంటే. ఆమె అంగీకరించటంలేదు గాని అంగీకరిస్తే ఆమెను పెళ్ళాడదా మనే ఉంది అతనికి. ఒకరోజు ఆమె అడిగింది అతణ్ణి.

"మీరింకా పెళ్ళెందుకని చేసుకోలేదు ఇంతకాలాన్నుంచీ?"

"మీలాంటి అందగత్తె దొరకాలిగా!"

"సరేలే, నా అందమే చెప్పుకోవాలిక!" విచిత్రంగా పెదవి విరిచింది.

ఆమె కళ్ళల్లో స్వాతిశయం స్పష్టంగా తెలుస్తోంది.

"నిజం అనూరాధా! మీ రొప్పుకోవాలి గాని మిమ్మల్ని చేసుకోవటం నా అదృష్టంగా భావిస్తాను."

"ఛీ ఛీ, ఇంకెప్పుడూ అట్లాంటి పాపపు ఆలోచనలు చేయకండి."

చనిపోయిన తన భర్తను దైవంలా ఆమె పూజించటం అదంతా చిరంజీవికి ఒకోసారి చిరాకు కల్గించేవి.

"చూడు అనూరాధా," అతనన్నా డొకసారి. "రాంబాబు పట్ల నాకూ గౌరవాభిమానాలున్నాయి. కాని చనిపోయిన అతనికి ఈ అధునిక కాలంలో కూడా మీరలా పూజలూ అవీ చేస్తూండటం మాత్రం నా కేదో ఎబ్బెట్టుగా కనిపిస్తోంది."

చురుగ్గా చూసిందామె.

"అదేమిటండీ అట్లా అంటారు! భర్త దైవంతో సమానం. అదీకాక ఆయన వ్యక్తిగతంగా కూడా దేవుడులాంటి మనిషి."

"అబ్బో, అంత మంచివాడన్న మాట!" వ్యంగ్యంగా అన్నాడు చిరంజీవి. ఆ వెంటనే ఆమెను ఉల్లాస పరచాలని మళ్ళీ అన్నాడు - తన చేతుల్ని రెంటినీ కొద్దిపాటి ఎడంలో పెట్టి చూపించుతూ—

"ఎంత, ఇంత మంచివాడా?"

ఆ సమయాన ఆమె మంచి మూడ్‌లో ఉందేమో అతను చూపించిందానికంటే ఇంకొంచెం ఎడానికి తన అరిచేతుల్ని పెట్టి చూపించుతూ అన్నది—

"లేదు ఇంత!"

"అంతేనా?" కొంటెగా అడిగా డతను.

"లేదు లేదు ఇంత!!" అంతకంటే ఇంకొంచెం ఎడానికి చేతుల్ని జరిపింది.

"ఓస్, ఆ మాత్రమేనా?" మరింత కొంటెగా అడిగాడు చిరంజీవి.

అదొక ఆటలా పరిణమించింది వాళ్ళ మధ్య.

"కాదు కాదు ఇంత!!!"

చేతుల్ని పూర్తిగా బారజాపి చూపించిందామె.

ఆ చేతుల మధ్యకు నన్ను జేర

విచ్చేంతగానా!!" అని, వెంటనే నాలిక కరుచుకున్నాడు చిరంజీవి.

క్షణంపాటు అనూరాధకు అతనే మన్నదీ అర్థంకాలేదు. కళ్ళను మాత్రం ఇంత పెద్దగా విశాలంచేసి చూసింది. వెంటనే ఆమె కళ్ళల్లో ఎర్రటి జీర చోటు చేసుకుంది.

"మీకు మరీ మతిపోతోంది!"

అనేసి గమ్మున లేచిపోయిందామె తన గదిలోకి

చిరంజీవిలో రోజు రోజుకూ అనూరాధపట్ల వ్యామోహం పెరిగిపో సాగింది నవ్వుతుంటే అమె పెదాల విన్యాసానికీ, స్వరమాధుర్యానికీ పిచ్చెత్తి పోయినట్లయే దతనికి. ఆమె తన తేనె కళ్ళతో అతని కళ్ళల్లోకి చూస్తే మనస్సుతో సంబంధాన్ని వొదులుకుని తన శరీరం శూన్యంలోకి తేలిపోతున్నట్లు అనిపించేదతనికి. కాఫీ అందించేటప్పుడో, వడ్డన చేసేటప్పుడో ఆమె కొద్దిగా ముందుకొంగితే పమిట వెనక కదిలే ఆ వక్షసంపదకి అతని కళ్ళు బ్లాస్ట్అయి పోతాయా అనిపించేది. కావాలనే అతను కొత్త పల్చటి చీరలు తెచ్చిపెట్టేవా డామెకు. ఆమె నడుస్తోంటే ఆ దుస్తుల్లోంచి ఆమె పొడుగాటి కాళ్ళనీడలు అస్పష్టంగా కనిపించి - లేక అతను వాటినలా ఊహించుకుని - అట్లాంటి సమయాల్లో ఏదో ఆటవిక ప్రవృత్తి అతని మనస్సులోకి జేరటానికి వెర్రి ప్రయత్నాలు చేసేది. ఒకరోజు తెల్లవారు ఝామున అతను కళ్ళు తెరిచేసరికి, ఆమె అప్పుడే నిద్రలేచినట్లుంది, చీర సరిజేసుకోకుండా అతని ముందునుంచి పెరట్లోకి నడుస్తోంది. ఎప్పుడూ ముడి వేసుకోబడివుండే ఆమె జడ ఆ సమయాన విడిపోయి వీపుమీంచి జారి విశాలమైన ఆమె పిరుదులమీద లయబద్ధంగా అటూ ఇటూ కదుల్తోంది. ఎవరామె - ప్రబంధాలలోని శృంగారనాయికా? లేక అప్పుడే భూలోకానికి దిగివచ్చిన దేవతా స్త్రీయా??

"అనూరాధా!!" తనలో మెదుల్తున్న భావాలనన్నింటినీ స్వరంలోకి జొప్పిస్తూ ఉత్కంఠగా పిల్చాడు చిరంజీవి.

ఆమె ఆగి వెనక్కు తిరిగిచూసింది.

ఆ పెద్ద పెద్ద కళ్ళు!!

''ఏమిటి?" అన్నది అక్కణ్ణించే.

"మిమ్మల్ని రేప్ చేయాలనిపిస్తోంది!''

పెదిమల్ని బిగించి చిత్రంగా నవ్విందామె.

"ఇంకా నయం, నన్ను కోసి కూరొండుకు తినాలనిపిస్తుందని అనలేదు!!"

జుట్టు పీక్కున్నాడు చిరంజీవి.

క్రమంగా అనూరాధలో మార్పు వస్తుండటం గమనించాడతను. పూర్వంలా ఆమె ఇప్పుడు ప్రతిదానికీ పాపపుణ్యాల ప్రసక్తి తేవటంలేదు. ఏం జరుగుతుందామెలో? శరీరం మనస్సును జయి



స్తోందా?? కావచ్చు! శాశ్వతంగా ఆమెను తనదానిని చేసుకోవాలంటే ఒక్కసారి తనామె శరీరాన్ని మలినపర్చాలి, బలవంతంగానైనాగాని. లేకపోతే ఈ దాగుడుమూతలూ, విరహవేదనలూ ఇలా జీవితాంతమూ సాగుతుండాల్సిందే. ఇలా నిశ్చయించుకున్న చిరంజీవి ఒకరోజు తన నిర్ణయాన్ని ఆచరణలో పెట్టడానికి ప్రయత్నించాడు.

ఆ మధ్యాహ్నం అనూరాధ తన గదిలో నిద్రపోతోంది ఆ ఉదయమే తలంటుకుందేమో ముంగురులు రేగి చిలిపిగా ఆమె మొహంమీద పడుతున్నాయి. ఆమె మంచం పక్కనే మోకాళ్ళమీద కూర్చుని చిరంజీవి నెమ్మదిగా ఆమె చెంపమీద తన పెదిమల్నానించాడు. మెత్తటి ఆ స్పర్శ అతనిలో విద్యుత్తును కదిపింది. అట్లాగే మూసుకునిఉన్న ఆమె వెడల్పాటి కనురెప్పల్ని, పొడుగాటి ముక్కునీ చుంబించాడు. ఆమె కదలనన్నాలేదు. చిరంజీవి మృదువుగా తన అరిచేతులతో ఆమె మొహాన్ని పట్టుకుని ఆమెనోటిమీద తన నోరునుంచాడు. ఒక్క క్షణం ఆమె

కదిలింది. చిన్నగా మూలిగింది. వెంటనే గభాల్న కళ్ళు తెరిచింది. మొదటి క్షణాన అతని మొహంలోకి నవ్వుతూ చూసింది. కాని ఆ వెంటనే భయంతో చిన్నగా అరవసాగింది ఎటో శూన్యం లోకి చూస్తూ.

"లేదండీ లేదు, నాకేమీ తెలియదు - నేను నిద్రపోతున్నాను - అమ్మో నా మీదకు రాకండి .."

"అనూరాధా - అనూరాధా - ఏమి టిది? ఎందుకట్లా భయపడుతున్నావు?" ఆమెను చిన్నగా కుదుపుతూ ప్రశ్నించాడు చిరంజీవి.

"అమ్మతోడు, నాలో ఆ ఉద్దేశ్యం లేదండీ - నాలో అట్లాంటి భావాలు లేవండీ" వణికిపోతోంది అనూరాధ.

ఆమె భుజాలు పట్టుమని కుదప సాగాడు చిరంజీవి.

"అనూరాధా! అనూరాధా!!"

ఆ క్షణాన అతను ఊహించని సంఘటన ఒకటి జరిగింది. అతను ఆమె మీదకు వొంగి నుంచున్నాడేమో అనూరాధ తన రెండు పాదాల్నీ గభాల్న అతని ఛాతీమీదకు రానిచ్చి బలాన్నంతా ఉపయోగించి ఒక్క తన్ను తన్నిం దతణ్ణి. వెనక్కు గోడవద్ద వెల్లికింతలా పడ్డాడు చిరంజీవి. వెంటనే అనూరాధ మంచంమీంచి దిగింది.

"వెళ్ళిపోండిక్కణ్ణించి! ముందీ గది లోంచి వెళ్ళిపోండి!!" అరిచిందామె వొణుకుతున్న పెదవుల్తో.

చిరంజీవి బయటికి వచ్చేస్తూ తన వెనకే ఆమె గది తలుపుల్ని మూసు కోవటం విన్నాడు.

రెండురోజులపాటు అనూరాధ అతనికి కనిపించకుండా తప్పించుకు తిరిగింది. చిరంజీవి కూడా చాలా గిల్టీగా ఫీలయ్యాడు ఆ రెన్నాళ్ళూ. మూడో రోజు ఆమెకామె అతని గదికి వచ్చింది.

"నన్ను మన్నించండి చిరంజీవి గారూ," అన్నది.

"అట్లా అనొద్దు అనూరాధా! తప్పు నాదే కదా — తల పక్కకు తిప్పి ఎటో చూస్తూ అన్నాడు చిరంజీవి.

"అసలు సంగతి అదికాదు. నేను మీకో విషయం చెప్పాలనుకుంటు న్నాను."

"ఏమిటది?"

"ఆ పూట ఆయన ప్రేతాత్మ నా గదిలోకి వచ్చింది. నావేపు కోపంగా చూసి నా మీదమీదకు వచ్చింది చేతు లూపుకుంటూ"

"వ్వాట్" అరిచాడు చిరంజీవి.

అరుంధతి చెప్పింది విని చాలా ఆశ్చర్యపడ్డాడతను.

రాంబాబు చనిపోవటానికి ముందు రోజు అరుంధతిని దగ్గర కూర్చోబెట్టు కున్నాడట. అప్పటికే అతనిమీద ఆశలు వదులుకున్నారంతా.

"అనూ! నేను చనిపోయాక ఇంకెవరి నైనా పెళ్ళిచేసుకుంటావా?"

"ఛిపాడు! ఎందుకండి అట్లా మాట్లాడతారు, నేనట్లాంటి మామూలు మనషిననుకుంటున్నారా?"

"లేదు అనూ - అయినా ఒట్టేసి చెప్పు!"

ఒక్క క్షణం అతని మొహంలోకి చూసిందామె.

"దైవసాక్షిగా చెబుతున్నాను - అట్లాంటిది జరుగకూడదు గాని - జీవి తాంతమూ మిమ్మల్ని పూజించుకుంటూ బ్రతుకుతాను తప్ప మరో పెళ్ళి చేసు కోను "

"ఎందుకంటున్నానంటే అనూ, కోరి కలు తీరకుండా చనిపోయిన మనుషుల ఆత్మలు ఊర్ధ్వలోకాలకు పోకుండా తమ కోరికలకు కేంద్రమయిన వస్తువుల చుట్టూ, మనుషులచుట్టూ పరిభ్రమిస్తూ ఇక్కడే అంటిపెట్టుకుని ఉంటాయి. నీ మీద నాకింకా ప్రేమా, మోహమూ చావ లేదు. అందుకే నీ మంచి కోరి చెబు తున్నాను."

రాంబాబు తన చేతుల్ని రెంటినీ గాల్లోకి చాపాడు. కనుగ్రుడ్లు పెద్దవి చేసి, నోరు తెరిచి, నాలిక బయటపెట్టి అసలే కళ్ళు పీక్కుపోయి బుగ్గలు లోతుకుపోయి కృశించిపోయి ఉన్నా డేమో - పరమ భయంకరంగా కనిపిస్తూ చాచిన చేతులతో ఒక రకమైన విన్యా సాన్ని గావించాడు.

"నువ్వు పాపం చేయబోయినప్పు డల్లా నా ప్రేతాత్మ ఈ రూపంలోగాల్లో తేల్తూ నీమీదకు వస్తుంది," అన్నాడట.

అనూరాధ భయంతో మొహం వంచు కుంది. మొన్న చిరంజీవి ఆమెను ప్రయత్నించబోయినప్పుడు రాంబాబు ప్రేతాత్మ ఈ రూపంలో కనిపించిందట ఆమెకు.

"దుర్మార్గుడా!" చిన్నగా గొణిగాడు చిరంజీవి. రాంబాబుమీద అతనికి అమితమైన కోపమొచ్చింది.

పై సంఘటన జరిగాక అనూరాధ మానసికంగా చిరంజీవికి మరింత చేరు వకు వచ్చింది. అతవిలో పూర్తిగా మనసు విప్పి మాట్లాడతోందిప్పుడు. కాని తరచుగా ఆమె భయాందోళనలకు గురవుతోందేమో ననిపించిందతనికి. అదే అడిగాడు.

"లేదు లేదు," కలవరంగా అన్న దామె.

కాని అది అబద్ధం. ఇన్స్టింక్టివ్‌గా ఆమెలో పేరుకుపోయిన నమ్మకాలు ఆమెను కృంగదీస్తున్నాయి. కాక రాంబాబు పెట్టిన భయం ఒకటి! ఆమెను ఎడ్యుకేట్ చేయాలనుకున్నాడు చిరంజీవి. మూఢనమ్మకాలతో మకిలిపట్టి ఉన్న ఆమె బ్రెయిన్‌ని వాష్‌చేసి ఆ స్థానంలో హేతుబద్ధమైన ఆలోచల్ని ప్రవేశపెట్టాలనుకున్నాడు. అందుకు తగ్గ ప్రయత్నాలు ప్రారంభించాడు.

కాని ఎంత చేసినా ఆమె పూజా కార్యక్రమాల్ని మట్టుకు ఆపించలేక పోయాడు. ఇట్లాంటి సమయంలో అతనికో రహస్యం తెలిసింది ఆమె ద్వారా. అది రాంబాబుకు సంబంధించిన పెట్టె ఒకటి ఆమె పూజాగదిలో ఉండటం. దాన్ని ఆమె ఇంతవరకూ ఏనాడూ ముట్టుకోలేదు. ఆమె వద్ద దాని తాలూకు తాళంచెవి కూడా లేదట. చిరంజీవిని కూడా ఆ పెట్టెజోలికి వెళ్ల వద్దన్నది భయంతో కళ్ళు పెద్దవిచేస్తూ. కాని ఆమెకు తెలియకుండా ఓ రోజు చిరంజీవి మారు తాళంచెవులతో ఆ పెట్టెను తెలిచాడు. డైరీలు! రాంబాబు రాసుకున్న డైరీలు ఉన్నాయందులో వాటిని భద్రంగా తన గదికి పట్టుకు పోయాడు చిరంజీవి చదవటం తప్పని అనిపిస్తూనే ఉన్నా రాంబాబు నాస్తికత్వాన్నుంచి ఆస్తికత్వంలోకి మారటానికి కారణాన్ని తెలుసుకోవాలన్న కుతూహలంతో చిరంజీవి వాటిని చదివాడు. చదువుతున్నకొద్దీ అతను ఆశ్చర్యంతో తలమున్కలవసాగాడు. అనేక విచిత్ర విషయాలున్నాయందులో. మచ్చుకి:- అనూరాధ శరీరసంపర్కానికి చాలా త్వరగా ఎప్పుడు పడితే అప్పుడు సిద్ధమవుతుంది. రాంబాబు దృష్టిలో అది 'నింఫోమనియా'. అట్లాంటి శరీరాలు కలవాళ్ళు బలమైన మానసిక అవరోధం ఏదైనా ఉంటే తప్ప పాపంచేయకుండా ఉండలేరు. ఇది రాంబాబు అభిప్రాయము. నిజానికి రాంబాబు చనిపోయేదాకా నాస్తికుడుగానే ఉన్నా అనూరాధలో అట్లాంటి మానసిక అవరోధం కోసం అతను ఆస్తికత్వాన్ని నటించి ఆమెలో పాపపుణ్యాల భావనల్ని ఇంజెక్ట్ చేసాడు. అందమైన ఆమె శరీరం తనకు తప్ప మరొకళ్ళకెవళ్ళకీ ఏనాటికీ దక్కకూడదన్న స్వార్థచింతనలో అతనామె మనస్సులోకి తన ప్రేతాత్మ భావననీ, భయాన్నీ ప్రవేశపెట్టాడు. ఇదంతా చదువుతుంటే జుగుప్సతో చిరంజీవి వొళ్ళు జలదరించింది. ఈ విషయాల గురించి అతను అనూరాధకు చెప్పాలని అనుకున్నాడు. కాని అలా చెప్పటంవల్ల ఆమెను న్యూనతపరుస్తున్నట్లు అవుతుందేమోననీ, కాక దైవంలా కొల్చుకుంటున్న భర్త యొక్క నీచత్వమూ స్వార్థపరతా తెలిసిన్నాడు ఆమె కృంగిపోతుందేమోననీ, ఎప్పటికప్పుడు ఆమెకు చెప్పకుండానే దాటవేసుకుంటూ వచ్చాడు. ఇలా చిన్నగా రోజులు గడుస్తున్నాయి. అనూరాధ ఫీలింగ్స్‌ని గాయపర్చకుండా ఆమెను తనదానిగా ఎలా చేసుకోవాలో అర్థంకావటం లేదు చిరంజీవికి. ఒకటి రెండుసార్లు ఆమె మంచి మూడ్‌లో ఉండగా ఆమె భుజాలమీద చేతులు వేసాడుగాని ఆమె వెంటనే మృదువుగా తోసేసింది వాటిని.



"వద్దు వద్దు తప్పు!!"

మరికొన్ని సార్లు ఆమెతో వివాహపు ప్రస్తావన తీసుకొచ్చాడతను. కాని ఆమె అంగీకరించటంలేదు. ఇంతలో వేసవి కాలం వచ్చింది. రాత్రులు వాళ్ళిద్దరూ డాబామీద పండుకుంటున్నారు. అంత గొప్ప సౌందర్యం తన సమీపంలో తన కందుబాటులో అవమరిచి నిద్ర పోతోందన్న స్పృహ అతణ్ణి ఎంతకీ నిద్ర పోనిచ్చేది కాదు. లేచి చప్పుడు కాకుండా ఆమె మంచంవద్దకు వెళ్ళి పుత్తడి బొమ్మలాఉన్న ఆమెమొహంలోకిచూస్తూ చాలాసేపు కాలాన్ని వెళ్ళబుచ్చేవాడు. అట్లాంటి సమయంలోనే ఒకసారి....

మంచంమీద అనూరాధ వెల్లకిలా పండుకుని నిద్రపోతోంది. నిండు వెన్నెట్లో ఆమె దేవతాస్త్రీలా మెరిసి పోతోంది. పమిట చెదిరి ఆమె ఉన్నతమైన వక్షోజాలు చిరంజీవిని కవ్విస్తున్నాయి. ఒక పక్క మంచంపట్టెమీద కూర్చుని చేతిని అవతలి పట్టెమీదకు జాపి ఆమె మొహంమీద మొహం పెట్టాడు చిరంజీవి. ఆమె పెదిమల మధ్య అతని నాలిక మృదువుగా పాములా కదలసాగింది. ఆమె పెదిమలు తిరిగి రెస్పాన్సునిచ్చేసరికి చిరంజీవిలో సంతోషమూ ఆవేశమూ వెల్లువలా విరుచుకుపడ్డాయి. రెండు చేతుల్తో అతనామెను కౌగిట్లోకి తీసుకోబోతుండగా...

సడన్‌గా అనూరాధ కళ్ళు తెరిచింది. వెంటనే కీచుమందామె గొంతు. ఒక ఉదుటున అతని చేతుల్నించి విడిపించుకుని మంచంనుంచి క్రిందకు దిగిందామె. ఆమె కళ్ళు శూన్యంలోకి- ఆకాశంవేపు చూస్తున్నాయి.

"నా తప్పు కాదండీ ఇది - నేను నిద్రపోతున్నాను - అతనే నా మీదకు వచ్చి...."

భయంతో అరుస్తూ ఆమె వెనక్కు నడవసాగింది. వెన్నెట్లో ఆమె మొహం వంకరలు తిరిగి వికృతంగా తయారయ్యింది.

"లేదండీ, ఇంకెప్పుడూ అట్లా చేయను- అసలీ ఇంట్లోనే ఉండను" వెనక్కి- వెనక్కి- నడుస్తోందామె అరుస్తూ.

అర్థమయింది చిరంజీవికి. తన స్పర్శలకు ఆమె శరీరం స్పందించింది. అందు కనువుగా ఆమె మొహం తనకు తాను సిద్ధపరచుకుంటుండగా ఆమెలో అంతకంటే బలీయమైన శక్తిగా రూపొంది ఉన్న అంతరాత్మ మేల్కొని భ్రాంతిపూర్వకమైన రాంబాబు ప్రేతాత్మను కళ్ళఎదుట సృష్టించి ఆమె మనస్సునూ శరీరాన్నీ తనకు బానిసను చేసుకుంది. తను పాపానికి వొప్పుకున్నందుకుగాను రాంబాబు ప్రేతాత్మ తనను కబళించటానికి మీదమీదకు వస్తోందన్న ఆ భ్రాంతిలో అమె వెనక్కు వెనక్కు నడుస్తోంది..

ఆమె అలా వెనక్కు నడుస్తుంటే చిరంజీవికి భయమేసింది, ఆమె ఎక్కడదాకా చివరకు పోతుందోనని. కాని అదే జరిగింది. అప్పటికి ఆమె పిట్టగోడదాకా పోయింది. ఇంకా నడుస్తోనే ఉందలా - భయంలో ప్రేలాపనలు చేస్తూ, నిలువెల్లా వణికిపోతూనూ.

"అనూరాధా! అనూరాధా!!" అంటూ గభాల్న ముందుకు దూకాడు. చిరంజీవి ఆమెను పట్టుకుని ఇవతలకు లాగాలని.

"అమ్మో!!!"

మరింత భయంతో వెర్రిగా అరుస్తూ పిట్టగోడ నుంచి వెనక్కు విరుచుకు పడిందామె.

చిరంజీవి కాళ్ళు ఒకటే వణికిపోతున్నాయి గభాల్న నేలమీదకు కూలబడిపోయి చేతుల్లో మొహం దాచుకుని బావురుమన్నాడు. అతనికి తెలుసు, క్రిందికి పోయి తనాదృశ్యాన్ని చూడలేడని. అక్కడంతా రాతి ప్రదేశం!

అలా రోదిస్తూ ఎంతసేపో కూర్చున్నాడు చిరంజీవి. ఆ రోదనలోనే, అతనికి అకస్మాత్తుగా రాంబాబు తన డైరీలో ఒక చోట రాసుకున్న వాక్యం గుర్తుకొచ్చింది.

'స్త్రీలలో పాతివ్రత్యం నిలవాలంటే వాళ్ళలో ఆస్తికభావాలు బలంగా నాటుకునేట్లు చేయాలి.'

"దుర్మార్గుడా, గెల్చావు రాంబాబూ!" కసిగా గొణిగాడు చిరంజీవి.